# చట్టాలు, కోర్టుల సాక్షిగా ఆదివాసులను అడవుల నుండి గెంటివేయడానికి సాగుతున్న నిరంతర కుతంత్రాలు

**అడవితల్లి** బిడ్డలైన ఆదివాసులను అడవుల నుండి గెంటివేయడానికి జులై 12ను చివరి తేదీగా నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం మొదటిదేమీ కాదు. ఈ ఆదేశంపై ప్రస్తుతానికి సుప్రీంకోర్టు తానే 'స్టే' ఇచ్చినా, 'ఆదివాసుల గెంటివేత', వెంట్రుకకు కట్టిన కత్తిలా ఆదివాసీ సమాజాల నెత్తిన వేలాడుతూనే వుంది. 1988 నుండి 2018 వరకు చట్టం, కోర్టుల సాక్షిగా ఆదివాపుల తొలగింపు- విరామం- తొలగింపు అనే దుర్మార్గపు ప్రక్రియ కొనసాగుతూనే వున్నది.

చట్టాలనేవి రూపొందని కాలం నుండీ ఆదివాసులు అడవులలో మమేకమై తరతరాలుగా జీవిస్తున్నారు. స్వపరిపాలన, అటవీ వనరులపై ఆదివాసీ సమాజాల ఉమ్మడి యాజమాన్యం అనేవి ఆదివాసీ సమాజాల విశిష్ట లక్షణాలు. కనుకనే నాటి బ్రిటిష్ పాలకుల నుండి నేటి సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలు, వారి దళారులవరకూ, ఆదివాసులను అడవులనుండి గెంటివేసి, అక్కడి అపార సహజసంపదలను లూటీ చేసుకునే లక్ష్యంతోనే దాడులు సాగిస్తున్నారు. ఆదివాసుల ఆత్మబంధువు, ప్రముఖ ప్రజాతంత్రవాది డాక్టర్ బి.డి.శర్మ మాటల్లో చెప్పాలంటే, ఆదివాసులు అశేష నిధులను కాపలాకాస్తున్న నాగుపాముల్లా వారికి కనబడుతున్నారు. చంపేసో, గెంటేసో అటవీ ప్రాంతాల కలప, వనరులు, ఖనిజాలను సొంతం చేసుకోవాలన్న కాంక్షే, ఆదివాసులపై చట్టబద్ధ, చట్టవిరుద్ధ దాడులకు కారణమనేది స్పష్టం.

బ్రిటిష్ కాలం నుండి అడవుల గురించి ప్రభుత్వాలు చేసిన ప్రతి చట్టం సిరా తడివెనుక ఆదివాసుల అపార రక్తపాతం ఇమిడి వుంది. 1857 నాటి ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామాన్ని అణచివేసిన తర్వాత కూడా అనేక ఆదివాసీ ప్రతిఘటనలు జరిగాయి. వీటిపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగించిన బ్రిటిష్ ప్రభుత్వం 1865 అడవుల చట్టం చేసింది. రెవెన్యూ, పోలీసు యంత్రాంగపు ప్రజావ్యతిరేక లక్షణాలతో పోతపోసిన విధంగా ఫారెస్టు యంత్రాంగాన్ని రూపొందించింది. చట్టాల కోరలకు పదునుపెడుతూ అడవులను - రిజర్వు అడవులు, రక్షిత అడవులుగా విభజించింది. రిజర్వు అడవులంటే ప్రభుత్వానికి దఖలుపరిచిన అడవులు. ప్రత్యేక అనుమతి వుంటే తప్ప ఈ అడవులలో నివాసం, పశుపాలన, చేపలవేట మొదలైనవన్నీ నిషిద్ధం. రక్షిత అడవులంటే ప్రభుత్వం ప్రత్యేక నిషేధం విధంచకుండా వుంటే, నివాసం, పోడువ్యవసాయం, పశుపాలన, చేపల వేట వంటివి సాగించవచ్చు. ఇవిగాక గ్రామాల అడవులు, ఆయా గ్రామాల అవసరాలకోసం వదిలినవి. ఈ అడవులన్నింటిపైనా అధికారం అటవీ శాఖదే.

ఆదివాసీ ప్రజానీకం అడవులపై ఈ పెత్తనానికి వ్యతిరేకంగా నాటి థానాభగత్‌ల పోరాటం నుండి అల్లూరి పోరాటంవరకూ, నేటి విప్లవోద్యమాల వరకూ పోరాడుతూనే వున్నారు. 1947 తర్వాత ప్రభుత్వాలు రక్షిత అడవులలో ఆదివాసుల హక్కులను కుదింపజేస్తూ వాటిని సౌకర్యాలు, వసతుల స్థాయికి దిగజార్చారు. దీని కొనసాగింపుగా 1976 ఎమర్జన్సీ చీకటి రోజులలో ఇందిరాగాంధి ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ చేసింది. అంతవరకు రాష్ట్రాల జాబితాలోవున్న అడవులను, ఉమ్మడి (కేంద్రం, రాష్ట్రాల) జాబితాలోకి మార్చుచేశారు. అడవులపై అంతర్జాతీయ స్థాయి దోపిడీదారుల చొరబాటుకు అవకాశాలను సులభతరం చేసే చర్య ఇది.

1977లో అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ ప్రభుత్వం, ఇందిరాగాంధీ చేసిన అనేక చట్టాలను తిరగదోడిందికానీ, అడవులను ఉమ్మడి జాబితాలో చేర్చిన చట్టం జోలికి పోలేదు. దీని కొనసాగింపుగా 1980లో అటవీ బిల్లును రూపొందించింది. ఆదివాసుల ప్రయోజనాలకు భంగకరమైన ఈ బిల్లును నాడే ఆదివాసీ, ప్రజాతంత్రశక్తులు వ్యతిరేకించారు. అయినప్పటికీ కేంద్రప్రభుత్వం 'అటవీ సంరక్షణ చట్టం-1980' చేసింది.

రక్షిత అడవులతోసహా ఆదివాసులెవరికీ పట్టాలు ఇవ్వరాదని, అటవీ కార్యకలాపాలు మినహా ఏ ఇతర కార్యక్రమాలు సాగించరాదని ఈ చట్టం పేర్కొంది. రాష్ట్రాల అధికారాలన్నింటినీ తన చేతుల్లోకి తీసుకొంది. కేంద్రప్రభుత్వ అనుమతి లేకుండా అడవులలో గనుల తవ్వకం, రోడ్ల నిర్మాణాం వంటి చర్యలేవీ చేపట్టరాదని ప్రకటించింది. 1980 సెప్టెంబర్ 30 నాటికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు క్రమబద్ధీకరించిన ఆదివాసులు తప్ప, రక్షిత, రిజర్వు అడవులలో నివశించే వారంతా ఆక్రమణదారులని ప్రకటించింది. ఇది ఆదివాసుల పాలిట మరణ శాసనం తప్ప వేరు కాదు. నేటి సుప్రీంకోర్టు ఆదేశాలకు మూలం ఇక్కడ వుంది. ఈ చట్టం 1984 సం॥ల నుండి అమలులోకి వచ్చాక, ముఖ్యంగా 1987-88 ప్రాంతాలలో అటవీ అధికారులు అడవులలోని ఆదిమ తెగలపై అకస్మాత్తుగా క్రూరమైన దాడులకు తెగబడ్డారు. ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దులలో ఆంధ్ర ప్రాంతంలోకి వచ్చారని సామంత కోందు తెగవారిని అనేకమందిని కాల్చిచంపారు. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషాల ఉమ్మడి సరిహద్దు ప్రాంతమైన ఖమ్మం జిల్లాలో 250 గుత్తికోయల గ్రామాలను మూకుమ్మడిగా తగులబెట్టారు. నాటి యస్‌సి, యస్‌టి కమిషనర్ డా॥ బి.డి. శర్మ తన ప్రసిద్ధి గాంచిన 29వ నివేదికలో వీటన్నింటినీ విపులంగా పేర్కొంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాపితంగా జరిగిన ఇలాంటి ఘోరాలపై తీవ్ర ఆందోళన చెలరేగింది. దీనితో కేంద్రం ఆరు సర్క్యులర్లను విడుదలచేసింది.

1980 సెప్టెంబర్ 30కి ముందునాటి ఆదివాసుల ఆవాసాలను క్రమబద్ధీకరించాలని, ఆదిమ తెగల మనుగడను కాపాడాలని అందులో పేర్కొన్నారు. అయితే ఈ సర్క్యులర్ల అమలుకు రెవెన్యూ, సాంఘిక సంక్షేమ, ఫారెస్టు అధికార యంత్రాంగమంతా కలిసి పనిచేయాలని చెప్పినా, ఫారెస్టు యంత్రాంగపు వైఖరిలో ఏమాత్రం మార్పులేదు. ఈ ఆదేశాలు ఏమాత్రం అమలు కాలేదు. కానీ, ఆదివాసులపై దాడులకు తాత్కాలిక విరామం లభించింది.

ప్రభుత్వానికి అడవుల సమస్యపై జరిగిన సుప్రీంకోర్టు వివాదాన్ని పురస్కరించుకొని కేంద్ర అటవీశాఖ అధికారి బహుగుణ పేర ఓ సర్క్యులర్ విడుదలచేస్తూ క్రమబద్ధీకరణకు అర్హులుకాని 'చొరబాటుదార్లందర్నీ' 2002 సెప్టెంబర్ 30 లోపు అడవుల నుండి ఖాళీ చేయించాలని చెప్పింది. దీనితో మరల ఆదివాసీలపై దాడులు ఉధృతమైనాయి. అస్సాంలో ఆదివాసీ గూడేలను ఏనుగులచేత నేలమట్టం చేయించారు. ఖమ్మం, వరంగల్, తూర్పుగోదావరి, విశాఖజిల్లాలలో గొత్తికోయలు, సామంత కొందుల గూడేలను తగులబెట్టారు. దేశవ్యాపితంగా 3 లక్షలమంది ఆదివాసులను గెంటివేశారు.

ఈ గెంటివేతలకు వ్యతిరేకంగా విస్తృత ఆందోళనలు జరిగాయి. 2004లో అధికారంలోకి వచ్చిన యుపిఏ సంస్కరణలకు 'మానవ ముఖం' వుండాలని చెప్పింది. ఆదివాసులకు 'చారిత్రక అన్యాయం' జరిగిందని వగచింది! 'అటవీ హక్కుల చట్టం–2006'ను ముందుకు తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ఇప్పటివరకూ అటవీశాఖ వద్దనున్న సెటిల్‌మెంట్ అధికారాలను గ్రామసభలకు బదిలీ చేసింది. గ్రామసభలు తమ ప్రాంతాల అటవీ వనరులపై తాము అనుభవిస్తున్న హక్కులను వ్యక్తిగత, సామాజిక క్లెయిమ్‌ల పేరుతో తీర్మానాలు చేయాలి. ఆయా గ్రామాల పరిధిలోని అడవి గురించి, వాటిలోని వనరుల గురించి మ్యాపులు తయారుచేసి డివిజన్‌స్థాయి కమిటీలకు అంద జేయాలి. ప్రభుత్వ, ఫారెస్టు అధికారులతో కూడిన కమిటి, గ్రామసభల తీర్మానాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి అర్హమైన వానిని సిఫార్సు చేస్తుంది. వాటిని పరిశీలించి జిల్లాకమిటి నిర్ధారించిన తర్వాతే, ఆ భూమికి పట్టాలివ్వాలి. ఈ సుదీర్ఘ క్రమానికి ఫారెస్టు యంత్రాంగం పురిట్లోనే సంధికొట్టినట్లు వ్యవహరించింది. గ్రామసభల తీర్మానాలను వివిధ సాకులతో తిరస్కరించింది. సామాజిక ఉమ్మడి యాజమాన్య క్లెయిమ్‌లను 3 శాతం మాత్రమే ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 168 విడుదలచేస్తూ ఫారెస్టు అధికారుల, గిరిజనుల ఉమ్మడి యాజమాన్యంలో వుండే 'వనసంరక్షణ సమితు'లకు అటవీ భూములను కోరుకునే 'అర్హత' నిచ్చింది. దీనితో రెండు తెలుగు రాష్ట్రాలలో 30 లక్షల ఎకరాల అడవి 4695 వన సంరక్షణ సమితుల చేతుల్లోకి వెళ్లింది. వీటిల్లోని వ్యక్తిగత, సామాజిక క్లెయిమ్‌లను తిరస్కరించారు. ఈవిధంగా వివిధ సాకులతో మన రాష్ట్రంలోని 66 వేల క్లెయిమ్‌లను, తెలంగాణాలోని 82 వేల క్లెయిమ్‌లను తిరస్కరించారు. దేశం మొత్తంమీద 42 లక్షల ఆదివాసుల క్లెయిమ్‌లలో 18 లక్షలను మాత్రమే ఆమోదించి మిగిలిన వాటన్నింటినీ (24 లక్షల క్లెయిమ్‌లను) నిరాకరించారు.

ఇదిలా వుండగా, మాజీ అటవీశాఖ ఉన్నతాధికారులు, మాజీ జమిందార్లు కలిసి 'వైల్డ్‌లైఫ్ ఫస్ట్' వంటి స్వచ్ఛంద సంస్థల పేరుతో 2016లో సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. 'అటవీ హక్కుల చట్టం – 2006' రాజ్యాంగ విరుద్ధమని, దాని అమలును నిలిపివేయాలని వాదన చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, 17 రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకీ నోటీసులు పంపింది. అయితే, కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలేవీ అటవీ హక్కుల చట్టం సమర్థనకు పూనుకోలేదు. దీనితో 29-1-2016న జస్టిస్ చలమేశ్వర్ తదితరులతో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తన తీర్పు వెలువ రించింది. దీని ప్రకారం ఆనాటికి కూడా క్రమబద్ధీ కరించబడని, తిరస్కరించబడిన క్లెయిమ్‌దారులను, ఆదివాసులను చొరబాటుదారులుగా పరిగణించి ఎందుకు తొలగించరాదో చెప్పాలని ప్రభుత్వాలను సంజాయిషీ కోరింది. తిరిగి 7-3-2018న జస్టిస్ గొగొయ్ తదితరుల నేతృత్వంలోని ధర్మాసనమూ దీనినే పునరుద్ఘాటించింది. ఇపుడు 13-2-2019న ఆదివాసులను జులైలోగా తొలగించమని ఆదేశ మిచ్చింది. ప్రభుత్వాల నివేదికల ప్రకారమే 75 ఆదిమ తెగలకు చెందిన 37 లక్షలమంది ఆదివాసుల జీవితం ఈ ఆదేశంతో ప్రశ్నార్థకమైంది.

కోర్టు వ్యవహారాలలో ఆదివాసుల తరపున వాదించేందుకు ప్రభుత్వాలు ఏ సందర్భంలోనూ ముందుకు రాలేదు. దీనికి కారణమేమిటి? ఆదివాసుల జీవితాలకు నామమాత్రం రక్షణనిచ్చే చట్టాలన్నీ అంతులేని వివాదాలతో కొట్టుమిట్టాడు తుంటాయి. కానీ, అటవీ వనరులను కొల్లగొట్టే దోపిడీదార్లకు గనులు, కలప, ఖనిజాలు ఎప్పుడూ అందుబాటులోనే వుంటాయి. ఆదివాసుల రాజ్యాంగ రక్షణలను కూడా తుంగలోతొక్కి చట్టాలు సూటిగా వారికి వ్యతిరేకంగా నిలుస్తాయి. ఈ తరహాలో 2016లో 'పునరుజ్జీవ అటవీ నష్టపరిహార నిధి చట్టం' చేశారు. నాశనం అయిన అడవుల స్థానంలో వాణిజ్యవనాలు పెంచేందుకు గనులు, ప్రాజెక్టుల క్రింద కోల్పోయిన భూముల స్థానంలో అంతే ఖాళీ భూములను గుర్తించి వాటిలో వాణిజ్యవనాలు పెంచేందుకు 66 వేల కోట్ల రూ॥తో ఈ నిధి ఏర్పరిచారు. దీనినుండే తెలంగాణా రాష్ట్రప్రభుత్వానికి 321 కోట్లు 'హరితహారం' క్రింద కేటాయించారు. ఈ నిధుల కోసమే తెలంగాణా ప్రభుత్వం వేలమంది ఆదివాసులను పోడుభూముల నుండి గెంటివేసింది; వారిపై తప్పుడు కేసులు బనాయించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వనం–మనం పేర ప్రజల స్వాధీనంలోని భూములన్నీ వనాల పేర స్వాధీనం చేసుకుంటున్నది. 2015 నుండి 2018 వరకూ ఈ 'నిధి' క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 271 కోట్ల రూ॥లు పొందింది. ఈవిధంగా ప్రభుత్వాలు సహజ అడవులను నాశనం చేసి, కార్పొరేట్ కంపెనీలకోసం ప్లాంటేషన్లు పెంచుతోంటే అడవులలో వుండాల్సిన వన్యప్రాణులు ఊర్లపై బడుతున్నాయి.

ప్రభుత్వం ఆదివాసులు వర్సెస్ అభివృద్ధి అంటూ ప్రాజెక్టులు కడుతోంది. వన్యప్రాణులు వర్సెస్ ఆదివాసులంటూ నేషనల్ పార్కులు ప్రకటిస్తోంది. అటవీ పునరుజ్జీవం వర్సెస్ ఆదివాసు లంటూ ఆదివాసులను కొండపోడుల నుండి తరిమివేస్తోంది. ఇపుడు చట్టాలు, న్యాయస్థానాలు, ప్రభుత్వాలు, కార్పొరేట్లు, సామ్రాజ్యవాద దోపిడీ శక్తులంతా ఒకప్రక్క, ఆదివాసీ సమాజాలు, ప్రజానీకం ఒకప్రక్క వున్నారు. మేధావులు, ప్రజాతంత్రవాదులు ఆదివాసులకు అండగా నిలుస్తున్నారు. ఆదివాసీ, రైతుకూలీ, ప్రజాతంత్ర ఉద్యమాలవలననే చింతపల్లి కొండలు ఇంకా బాక్సైట్ బకాసురుల పాలిట పడకుండా తాత్కాలికంగానైనా ఆగాయి. కనుక, ఆదివాసుల మనుగడకోసం పోరాటం, పర్యావరణ పరిరక్షణ పోరాం కూడా. ప్రస్తుత సుప్రీం ఆదేశాల నేపథ్యంలో, ఆదివాసులను చొరబాటుదారులుగా ముద్రలు వేసిన అన్ని చీకటిచట్టాలు, శాసనాల రద్దుకై పోరాడాలి; అడవులపై తమహక్కును పరిరక్షించుకోవాలి.

ooOo